క్లుప్తంగా

నిమిషాంబ దేవికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో నిమిషాంబ దేవి

కర్నూలు కల్చరల్: ఓల్డ్ సిటీ చిత్తారివీధిలోని నిమిషాంబ దేవి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నిమిషాంబా దేవి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయంలో గణపతి పూజ, అమ్మవారికి అభిషేకం, సామూహిక కుంకుమార్చన, ఊంజల్ సేవ, ప్రసాద వితరణ కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు వెంకటేష్, మనోహర్ డిమాండ్ చేశారు. బుధవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో విధులు బహిష్కరించి స్థానిక నగరపాలక సంస్థ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పలు న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని గత ఏడాది డిసెంబర్‌లో పది రోజుల పాటు వివిధ రూపాల్లో ఆందోళనలు చేశామన్నారు. అప్పట్లో స్పందించిన ప్రభుత్వం ఇంజినీరింగ్ కార్మికుల డిమాండ్లను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఐదు నెలలవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. 30 సంవత్సరాలుగా ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న తమకు జీతంతో పాటు ఆరోగ్య అలవెన్స్ కలిపి రూ.21 వేలు, అలాగే డ్రైవర్లకు రూ.24 వేలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే సమ్మెతో పాటు ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామన్నారు. మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు పాల్గొన్నారు.

ఆపరేషన్ సిందూర్‌పై హర్షం


రాజ్‌విహార్ సెంటర్‌లో సంబరాలు చేసుకుంటున్న యువత

కర్నూలు కల్చరల్: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌పై కర్నూలు యువత హర్షం వ్యక్తం చేస్తున్నారు. పాక్‌పై దాడిని హర్షిస్తూ బుధవారం రాత్రి పలువురు యువత రాజ్‌విహార్ సెంటర్‌లో బాణాసంచా కాలుస్తూ సంబరాలు జరుపుకున్నారు. జాతీయ పతాకాలను చేతపట్టుకొని ద్విచక్ర వాహనాలతో నగరంలోని వీధుల్లో ర్యాలీ చేశారు. 'భారత్ మాతకు జై' అంటూ నినాదలు చేస్తూ కేరింతలు కొట్టారు.

ఘనంగా వాసవీ జయంతి


చిన్న అమ్మవారి శాలలో పూజల్లో పాల్గొన్న భక్తులు

కర్నూలు కల్చరల్: నగరంలోని అమ్మవారి శాలల్లో బుధవారం వాసవీ కన్యకా పరమేశ్వరి మాత జయంతి ఘనంగా నిర్వహించారు. ఓల్డ్ సిటీలోని చిన్న అమ్మవారి శాల, పెద్ద అమ్మవారి శాల, గీతా మందిరంలో వాసవీ జయంతి వేడుకలతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. అభిషేకం, అర్చన, లలితా సహస్ర నామ పారాయణం తదితర విశేష పూజలు జరిగాయి. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. కలశాలతో ఊరేగింపు నిర్వహించారు. తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. చిన్నఅమ్మవారి శాలలో జరిగిన పూజల్లో రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్, సతీమణి టీజీ రాజ్యలక్ష్మి ఆలయ కమిటీ అధ్యక్షుడు జూటూరు గోపాలయ్య, కమిటీ సభ్యులు శేషగిరి శెట్టి, రవి, జవహర్ బాబు, హేమంత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయ విగ్రహావిష్కరణ

కల్లూరు: దళిత జన బాంధవుడు, ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య దేశానికి చేసిన సేవలు ఎనలేనివని రాజ్యసభ మాజీ సభ్యుడు వి.హనుమంతురావు, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అన్నారు. బుధవారం పెద్దపాడులో దామోదరం సంజీవయ్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దామోదరం రాధాకృష్ణమూర్తి ఆధ్వర్యంలో సంజీవయ్య మ్యూజియం, సామాజిక న్యాయ విగ్రహావిష్కరణ పేరుతో దామోదరం సంజీవయ్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. మొట్టమొదటి దామోదరం సంజీవయ్య పురస్కారాన్ని ఉద్యమకారుడు, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరికి అందించారు. అతిథులు మాట్లాడుతూ.. సంజీవయ్య వ్యక్తిత్వం పరిపాలన, నిజాయితీ గురించి వివరించారు. దేశంలో మొట్టమొదట సామాజిక పెన్షన్లను తీసుకొచ్చారని కొనియాడారు. దామోదరం సంజీవయ్య మెమోరియల్ వార్డు కమిటీ చైర్మన్ రామశేషయ్య, బహుజన విద్యావంతుల వేదిక అధ్యక్షుడు జేవీ కృష్ణయ్య, భారత్ కిసాన్ యూనియన్ అధ్యక్షుడు సయ్యద్ ముర్షీద్ ఫీర్ ఖాద్రి, బహుజన నాయకులు మోజెస్, ట్రస్టు సభ్యులు ఈశ్వరయ్య, రంగస్వామి, పోతుల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల్లో రక్త కన్నీరు!

- వేధిస్తున్న తలసీమియా వ్యాధి
- నెలకు ఒకటి, రెండు సార్లు రక్తం ఎక్కించాల్సిందే
- ప్రతి నెలా రూ.8 వేల దాకా ఖర్చు
- వీరి వేదన విని ప్రత్యేక పింఛన్ మంజూరు చేసిన మాజీ సీఎం జగన్
- కర్నూలు ప్రభుత్వాసుపత్రిలోని డైస్ కేంద్రంలో ప్రత్యేక చికిత్స
- రెడ్‌క్రాస్ రక్తనిధి ద్వారా ఉచితంగా రక్తం అందజేత
- నేడు వరల్డ్ తలసీమియా డే



కర్నూలు(హాస్పిటల్): సాధారణంగా పిల్లలంటే ఆడుతారు.. గెంతులేస్తారు. కాస్త అల్లరి పిడుగులైతే ఒక్కచోట నిలబడరు. ఇళ్లంతా చిందరవందర చేస్తారు. వీధి అంతా కలియదిరుగుతారు. కానీ తలసీమియా మహమ్మారి సోకిన చిన్నారులు మాత్రం కాస్త ఆడగానే అలసిపోతారు. కొద్దిసేపు గెంతులేయగానే నావల్ల కాదంటూ నిస్సత్తువగా ఒకేచోట కూర్చుండిపోతారు. ఇతర చిన్నారులు ఆడుతూ పాడుతూ ఉంటే నేనెందుకు ఇలా ఉన్నానా అని మధనపడిపోతుంటారు. వారి వేదనకు, బాధకు అర్థం తెలియని వయస్సు వారిది. అలాంటి చిన్నారులను రక్తపిశాచిలా పీడిస్తోంది తలసీమియా. ఈ నెల 8వ తేదీన వరల్డ్ తలసీమియా డే సందర్భంగా ప్రత్యేక కథనం.

జిల్లాలో ప్రస్తుతం 146 మందికి పైగా చిన్నారులు ఈ వ్యాధితో సతమతమవుతున్నారు. వీరందరూ కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని సత్వర బాలల చికిత్స కేంద్రం (డైస్)లో చికిత్స తీసుకుంటున్నారు. వీరిలో రక్తం అవసరమైన వారికి చిన్నపిల్లల విభాగంలో వైద్యుల సమక్షంలో ఎక్కిస్తారు. వారి వయసును బట్టి నెలకు ఒకటి, రెండుసార్లు రక్తం ఎక్కించాల్సి ఉంటుంది. ఇందుకోసం వారి తల్లిదండ్రులు ప్రయాణ, ఇతర ఖర్చుల కోసం నెలకు రూ.3 వేల నుంచి రూ.8 వేల దాకా ఖర్చు పెడుతుంటారు. వీరి ఇబ్బందులను మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి 2018లో పాదయాత్ర సందర్భంగా కళ్లారా చూశారు. వారికి నేనున్నానని భరోసానిచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే వారికి ప్రతి నెలా రూ.10 వేల ప్రత్యేక పెన్షన్ అమలు చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రతి నెలా ఈ మొత్తాన్ని ఆ చిన్నారులు అందుకుంటున్నారు.

చిన్నారుల పట్ల రక్తపిశాచి


తలసీమియా వ్యాధి రక్తంలోని హిమోగ్లోబిన్‌పై ప్రభావం చూపుతుంది. మనం పీల్చుకునే ఆక్సిజన్‌ను అన్ని శరీర భాగాలకు రక్తం ద్వారా అందించే బాధ్యత హిమోగ్లోబిన్‌ది. తలసీమియా రోగుల్లో శరీరానికి అవసరమైనంత మేర హిమోగ్లోబిన్ ఉత్పత్తి కాదు. తయారైనా ఎక్కువ కాలం ఉండదు. ఫలితంగా హిమోగ్లోబిన్ నిల్వలు దారుణంగా పడిపోతూ ఉంటాయి. అలా పడిపోయిన ప్రతిసారీ కృత్రిమంగా అందించాల్సి ఉంటుంది.

మేనరికపు వివాహానికి దూరమే మేలు

మేనరికపు వివాహం వల్ల, జన్యుపరమైన కారణాల వల్ల ఈ వ్యాధి వస్తుంది. ఇలాంటి వివాహాలు చేసుకోకుండా ఉండటం వల్ల ఈ వ్యాధిని ఆదిలోనే అంతం చేయవచ్చు. ఒకవేళ చేసుకోవాల్సి వస్తే వధూవరులు కంప్లీట్ బ్లడ్ కౌంట్ (సీబీసీ), హెచ్‌బీఏ 2 లెవల్ పరీక్షలు చేయించుకోవాలి. ఇద్దరిల్లో ఒకరైనా తలసీమియా వాహకులు కాదని తేలితే నిరభ్యంతరంగా పెళ్లి చేసుకోవచ్చు. ఇద్దరూ తలసీమియా వాహకులైతే వారికి జన్మించబోయే బిడ్డకు వ్యాధి వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. రక్తసంబంధీకుల్లో తలసీమియా వ్యాధి లక్షణాలు ఉన్నాయంటే మరింత జాగ్రత్త పడాలి.

పుట్టుకతోనే వస్తుందీ మహమ్మారి

తలసీమియా జన్యు సంబంధమైన వ్యాధి. మేనరికపు వివాహాలు చేసుకున్న తల్లిదండ్రుల మూలంగా చాలా వరకు జన్యుపరంగా ఈ వ్యాధి పిల్లలకు వస్తోంది. తలసీమియా జన్యువాహకులైన తల్లిదండ్రులకు జన్మించే బిడ్డల్లో పాతిక శాతం మంది పుట్టుకతో ఈ వ్యాధికి గురవుతున్నారు. మరో 25 శాతం సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటే ఇంకో 50 శాతం మంది తలసీమియా మైనర్‌గా మిగిలిపోతున్నారు. అయితే వీరికి పెద్దగా సమస్యలు ఉండవు కానీ వీరు పెళ్లి చేసుకున్న వారి ద్వారా వారికి కలిగే సంతానానికి తలసీమియా వచ్చే అవకాశం ఉంది. మన దేశంలో దాదాపు ఆరు కోట్ల మంది తలసీమియా వాహకులు ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ లెక్కల ప్రకారం ప్రపంచంలో 4.5 శాతం మంది చిన్నారులు ఈ వ్యాధితో బాధపడుతుండగా మన దేశంలో 3.5 కోట్ల మంది ఉన్నట్లు తెలుస్తోంది.



చిన్నారులకు ఉచితంగా రక్తం



కర్నూలు రెడ్‌క్రాస్ సొసైటీ రక్తనిధిలో 146 మంది తలసీమియా బాధిత చిన్నారులు రిజిస్టర్ అయ్యారు. వారందరికీ ప్రతి నెలా ఉచితంగా రక్తం అందిస్తున్నాం. ఇందులో వయస్సు పెరిగే కొద్దీ కొందరికి రెండు, మూడు యూనిట్ల రక్తం అవసరం అవుతుంది. ఇక్కడ తీసుకున్న రక్తం ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని చిన్నపిల్లల విభాగంలో ఎక్కించుకుంటారు. త్వరలో రెడ్‌క్రాస్‌లోనే తలసీమియా సెంటర్ ఏర్పాటు చేయబోతున్నాం.

– డాక్టర్ కేజీ గోవిందరెడ్డి, చైర్మన్, జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ, కర్నూలు

డైస్‌లో ఉచితంగా చికిత్స, మందులు



కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణలో ఉన్న సత్వర బాలల చికిత్స కేంద్రం(డైస్)లో తలసీమియా బాధిత చిన్నారులకు ఉచితంగా చికిత్స, మందులు అందజేస్తున్నాం. పిల్లలకు అవసరమైన మందులు ఐరన్ చీలేటర్స్, ఫోలిక్ యాసిడ్, కాల్షియం, మల్టీవిటమిన్ మాత్రలు ఇస్తున్నాం. చిన్నారులకు ప్రతి 15 రోజులకు ఒకసారి రక్తంలో ఐరన్ శాతాన్ని చెక్ చేయిస్తూ ఉండాలి. ఆ మేరకు వారికి చికిత్స, మందులు అందజేస్తాం.

– మహ్మద్ ఇర్ఫాన్, మేనేజర్, డైస్, కర్నూలు

నేడు మోహినీ ఏకాదశి

కర్నూలు కల్చరల్: గీతా ప్రచార సంఘం ఆధ్వర్యంలో సంకల్‌బాగ్‌లోని గీతా ప్రచార ధామంలో గురువారం మోహినీ ఏకాదశి వేడుకలు నిర్వహిస్తున్నట్లు గీతా ప్రచార సంఘం అధ్యక్షుడు డీవీ రమణ తెలిపారు. ఉదయం 9.30 గంటలకు సంపూర్ణ భగవద్గీత పారాయణ యజ్ఞం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ధార్మిక సంస్థల ప్రతినిధులు, హిందువులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

భగవద్గీత పారాయణం

కర్నూలు కల్చరల్: నగర శివారులోని సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఏకాదశి పురస్కరించుకొని గురువారం ఉదయం 9.30 గంటలకు సంపూర్ణ భగవద్గీత పారాయణం నిర్వహిస్తున్నట్లు ఆలయ ట్రస్ట్ సభ్యులు తెలిపారు. భక్తులందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

ఆ క్లినిక్‌లపై చర్యలు తీసుకోండి

కర్నూలు(హాస్పిటల్): ప్రభుత్వ అనుమతి లేకుండా లేజర్ ట్రీట్‌మెంట్ నిర్వహిస్తున్న క్లినిక్‌లపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు, నగర కార్యదర్శి బీసన్న తదితరులు బుధవారం వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ ఏఓ అరుణకు వినతి పత్రం అందజేశారు. ఈ క్లినిక్‌లు ఎలాంటి అనుమతులు లేకుండా చర్మానికి సంబంధించిన వైద్య పరీక్షలు, వైద్యం నిర్వహిస్తున్నాయని విమర్శించారు.

నేడు చిన్మయానంద మహారాజ్ జయంతి

కర్నూలు కల్చరల్: పూజ్య స్వామి చిన్మయానంద మహారాజ్ జయంతి వేడుకలను గురువారం సాయంత్రం 5 గంటలకు వీఆర్ కాలనీలోని చిన్మయానంద ప్రభావళిలో నిర్వహించనున్నట్లు చిన్మయ మిషన్ జిల్లా బాధ్యులు స్వామిని సుప్రేమానంద సరస్వతి తెలిపారు. చిన్మయ బాలల సంస్కార సాధనా శిబిరంలో విద్యార్థులు నేర్చుకున్న అంశాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. మిషన్ సభ్యులు, భక్తులు పాల్గొనాలని కోరారు.

ఓటరు జాబితా నవీకరణకు సహకరించాలి


మాట్లాడుతున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): కర్నూలు నియోజకవర్గానికి సంబంధించి ఓటరు జాబితా నవీకరణకు రాజకీయ పార్టీలు సహకరించాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబు కోరారు. బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ.. కొత్త ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపునకు కేంద్ర ఎన్నికల సంఘం అవకాశం ఇచ్చిందన్నారు. దీనిని సక్రమంగా నిర్వర్తించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలన్నారు. ఎవరైనా చిరునామా, పోలింగ్‌బూత్ మార్పు, చనిపోయిన వ్యక్తుల ఓటు తొలగించుకునేందుకు స్థానిక బూత్ లెవల్ ఆఫీసర్లను సంప్రదించాలని కోరారు. అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, డీటీ ధనుంజయ్, సూపరింటెండెంట్ సుబ్బన్న పాల్గొన్నారు.

ఉషూ శిక్షణ శిబిరం ప్రారంభం


శిబిరాన్ని ప్రారంభిస్తున్న డీఎస్‌డీఓ భూపతిరావు

కర్నూలు (టౌన్): జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత ఉషూ శిక్షణ కేంద్రాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు సూచించారు. బుధవారం స్థానిక పెద్దమార్కెట్‌లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో శిక్షణా శిబిరం ప్రారంభమయ్యింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒత్తిడిని అధిగమించేందుకు విద్యార్థులకు క్రీడలు అవసరమన్నారు. వేసవికాలం సెలవుల్లో ఈ శిక్షణను ఉపయోగించుకుని ఉత్తమ క్రీడాకారులుగా రాణించాలన్నారు. అనంతరం శిక్షణా శిబిరంలో పాల్గొన్న క్రీడాకారులకు అల్పాహారాన్ని అందజేశారు. జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి జి.శ్రీనివాసులు, జిల్లా ఉషూ సంఘం కార్యదర్శి టి.శ్రీనివాసులు, తైక్వాండో మాస్టర్ వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర పోరాటంలో అల్లూరి పాత్ర కీలకం


అల్లూరి చిత్రపటానికి నివాళులర్పించిన ఏఆర్ పోలీసు సిబ్బంది


మాట్లాడుతున్న ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్

కర్నూలు: స్వాతంత్య్ర పోరాటంలో అల్లూరి సీతా రామరాజు పాత్ర కీలకమైనదని, పరిమిత వనరులతో బ్రిటీషు వారిని గడగడలాడించిన పోరాట యోధుడని కర్నూలు ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణ మోహన్ అన్నారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశం కోసం ఆయన చేసిన త్యాగాన్ని కొనియాడారు. ఆర్ఐలు జావెద్, నారాయణ, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

అల్లూరి సీతారామరాజుకు నివాళి


అల్లూరి ఫ్లెక్సీ వద్ద మాట్లాడుతున్న నాయకులు

కర్నూలు(సెంట్రల్): పాత కంట్రోల్ రూమ్ సర్కిల్‌లో బుధవారం ఏఐడీఎస్ఓ, ఏఐడీవైఓ, ఏఐఎంఎస్ఎస్ ఆధ్వర్యంలో అల్లూరి శత వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి నివాళుర్పించారు. ఏఐడీఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు వి.హరీష్‌కుమార్‌రెడ్డి, రామశేషయ్య మాట్లాడుతూ.. అత్యంత పిన్న వయసులోనే దేశం కోసం ఆనాడు అల్లూరి సీతారామరాజు ప్రాణత్యాగం చేశారన్నారు. ఆయన స్ఫూర్తితో దేశంలో మతోన్మాదంపై పోరాటాలు చేయాలని యువతకు పిలుపు ఇస్తున్నట్లు చెప్పారు.

దళితబాంధవుడు సంజీవయ్య

కర్నూలు(సెంట్రల్): మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య దళిత బాంధవుడు అని నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు షేక్ జిలానీబాషా కొనియాడారు. బుధవారం దామోదరం సంజీవయ్య వర్ధంతిని పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ.. దామోదరం సంజీవయ్య నలుగురు ప్రధాన మంత్రుల క్యాబినెట్‌లో, రెండుసార్లు అఖిల భారత కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా పనిచేశారని, దేశంలోనే తొలి దళిత ముఖ్యమంత్రిగా పనిచేసి ప్రజలకు సేవ చేశారన్నారు. ఆయన ఆశాయాలను కాంగ్రెస్ పార్టీ కొనసాగిస్తుందన్నారు. మాజీ ఎమ్మెల్సీ సుధాకరబాబు, మహేంద్ర నాయుడు, అనంతరత్నం తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్త పడాలి


అవగాహన కల్పిస్తున్న జిల్లా మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు శెట్టి

కర్నూలు(హాస్పిటల్): ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు శెట్టి సూచించారు. బుధవారం స్థానిక ఇందిరమ్మ కాలనీ యూపీహెచ్‌సీ పరిధిలోని డ్రైవర్స్ కాలనీ 93వ సచివాలయంలో నిర్వహిస్తున్న టీకాల కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. గర్భిణులు, పిల్లలు ప్రాణాంతక వ్యాధుల భారిన పడకుండా వ్యాధి నిరోధక టీకాలు క్రమం తప్పక వేయించాలని సూచించారు. వడదెబ్బ తగలకుండా ఉండేందుకు ఉదయం 10 గంటల్లోపు పనులు ముగించుకుని నీడ గల ప్రదేశాలలో ఉండాలన్నారు. ఎండలో వెళ్లాల్సి వస్తే గొడుగు/టోపీ/తలపై టవల్ పెట్టుకుని, కాళ్లకు చెప్పులు ధరించి వెళ్లాలని, వెంట నీళ్ల బాటిల్ తీసుకుని గంట గంటకు తాగాలని సూచించారు. వడదెబ్బకు గురైన వారికి ప్రాథమిక చికిత్స చేసి సమీప ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించాలని చెప్పారు. డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, ఆరోగ్య కార్యకర్త సత్యకళ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్‌యూలో నూతన కోర్సులు ప్రారంభించాలి

కర్నూలు కల్చరల్: రాయలసీమ వర్సిటీలో నూతన కోర్సులను ప్రారంభించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.శరత్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో వర్సిటీ ఏడీ బిల్డింగ్ వద్ద ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వర్సిటీలోని విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలన్నారు. ఆర్‌యూ ఇంజినీరింగ్ కళాశాలకు రెగ్యులర్ ప్రిన్సిపాల్‌ను నియమించాలని, టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని, స్కిల్ హబ్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వర్సిటీ హాస్టళ్లలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని, మరమ్మతులను వేగవంతం చేయాలన్నారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే పరిపాలన భవనాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు అలీ, భరత్, ఈశ్వర్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయండి

కర్నూలు(సెంట్రల్): మే 20వ తేదీన దేశవ్యాప్తంగా జరిగే కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శులు ఎండీ అంజిబాబు, ఎస్.మునెప్ప పిలుపునిచ్చారు. బుధవారం ఏఐటీయూసీ కార్యాలయంలో నిర్వహించిన సమ్మె కార్యచరణలో వారు మాట్లాడుతూ.. నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చాక కార్మిక చట్టాలను రద్దు చేయడంతో కార్మికులు బానిసలుగా మారారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ 20వ తేదీన చేపట్టే సమ్మెను జయప్రదం చేయాలన్నారు. నాయకులు బి.నాగరాజు రఘుబాబు, రమణ, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌యూ విద్యార్థిపై కేసు నమోదు

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీ ఇంగ్లిష్ డిపార్ట్‌మెంట్ విద్యార్థి, విద్యార్థి సంఘం నాయకుడు బి.నాగరాజుపై తాలుకా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. వర్సిటీలోని ఫోర్త్ బిల్డింగ్ సమీపంలో ఈనెల 1వ తేదీన నాగరాజు తనపై దాడి చేశాడని వర్సిటీ ఎలక్ట్రీషియన్ రమేష్‌యాదవ్ పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. అయితే పోలీసులు కేసు నమోదు చేయలేదు. దీంతో బుధవారం పలువురు బీసీ, ప్రజా, మహిళా సంఘాల నాయకులు వర్సిటీకి వచ్చి రిజిస్ట్రార్ డాక్టర్ విజయకుమార్ నాయుడు, వీసీ ప్రొఫెసర్ వి.వెంకట బసవరావుతో వాగ్వివాదం చేశారు. పోలీస్‌లు కేసు నమోదు చేయకుండా వర్సిటీ అధికారులు అడ్డుకుంటున్నారని ఆరోపించడంతో తామెందుకు అడ్డుకుంటామని వారు బదులిచ్చారు. ఎట్టకేలకు బుధవారం సాయంత్రం తాలుకా పోలీసులు నాగరాజుపై కేసు నమోదు చేశారు.

నాటుసారా విక్రేతల అరెస్టు

కర్నూలు: కర్నూలు ఎక్సైజ్ స్టేషన్ సీఐ చంద్రహాస్ ఆధ్వర్యంలో గుమ్మితం తండా, హుసేనాపురం గ్రామాల్లో దాడులు నిర్వహించి ముగ్గురు సారా విక్రేతలను అరెస్టు చేసి 45 లీటర్ల నాటుసారా సీజ్ చేశారు. నిందితులపై కేసు నమోదు చేసి జైలుకు పంపారు. ఎక్సైజ్ సీఐ చంద్రహాస్‌తో పాటు ఎస్ఐలు నవీన్‌బాబు, నాగరాజు, సిబ్బంది బృందాలుగా ఏర్పడి గుమ్మితం తాండా, హుసేనాపురం గ్రామాల్లో తనిఖీలు నిర్వహించారు. గుమ్మితం తాండాకు చెందిన బీమా నాయక్ వద్ద 18 లీటర్లు, మొదిరేచ లోక్ నాయక్ వద్ద 12 లీటర్లు, హుసేనాపురం గ్రామానికి చెందిన కురువ సుధాకర్ వద్ద 15 లీటర్ల నాటుసారా కలిపి మొత్తం 45 లీటర్లు స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

కుట్టు మిషన్ శిక్షణలోనూ దోచుకోవడమేనా?

కర్నూలు(రూరల్): పేద మహిళలకు ఇచ్చే కుట్టు మిషన్ల నిధులను కూటమి నాయకులు దోచుకోవడం దారుణమని కర్నూలు నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు స్వాములు అన్నారు. బుధవారం కర్నూలు ఆర్డీఓ కార్యాలయంలో ఆయన మాట్లడుతూ దాదాపు రూ.150 కోట్లు దోచుకోవడానికి ఈ కూటమి ప్రభుత్వం కుట్ర పన్నిందని ఆరోపించారు. అనంతరం కుట్రపై చర్యలు తీసుకోవాలని కార్యాలయ ఏఓ వేణుగోపాల్ రావుకుకు వినతి పత్రం అందజేశారు. కర్నూలు మహిళా ప్రెసిడెంట్ మంగమ్మ, సిటీ అంగన్‌వాడీల సంఘ అధ్యక్షురాలు రాధికమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీను,మధు పాల్గొన్నారు.

ఉగ్రవాద సంస్థల ఏరివేతపై హర్షం


ఎర్రబోతుల పాపిరెడ్డి, జెడ్పీ చైర్మన్

కర్నూలు(అర్బన్): పాకిస్తాన్‌లోని ఉగ్రవాద సంస్థల ఏరివేతకు భారత సైన్యం చేపట్టిన దాడుల పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోందని జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. ఆయన బుధవారం మాట్లాడుతూ.. గత నెల 22న జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదులు సాగించిన నరమేధానికి 26 మంది అమాయక పర్యాటకుల ప్రాణాలు బలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థలు ఈ ఘోరానికి పాల్పడ్డాయన్నారు. ఆర్థికంగా చితికిపోయి, పలు అంతర్గత సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నా, పరిస్థితులను చక్కదిద్దుకోకుండా పాకిస్తాన్ మన దేశంలో అలజడి సృష్టించేందుకు ప్రయత్నించి భారత సైన్యం చేసిన దాడితో తగిన మూల్యం చెల్లించుకుందన్నారు. భారత సైన్యం తగిన వ్యూహంతో తెల్లవారుజామున 1.05 గంటల నుంచి 1.30 గంటల మధ్య పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో 9 ఉగ్రవాద సంస్థల స్థావరాలను లక్ష్యంగా చేసుకొని వైమానిక దాడులు చేశాయన్నారు. ఈ విషయం తెలియగానే యావద్భారతం ఎంతో సంతోషించిందన్నారు. దేశ పౌరుడిగా తనకు ఎంతో గర్వంగా ఉందన్నారు. ఉగ్రవాద సంస్థల ఏరివేతకు కృషి చేసిన త్రివిధ దళాలకు అభినందనలు తెలిపారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం


అలంకరణలో వీరబ్రహ్మేంద్ర స్వామి, గోవిందమాంబ

కర్నూలు కల్చరల్: వైశాఖ శుద్ధ దశమి సందర్భంగా బుధవారం ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. వీరబ్రహ్మేంద్రస్వామి సమాధి నిష్ఠ వహించిన పవిత్రదినం పురస్కరించుకొని స్వామివారి ఆరాధన జరిగింది. గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి వార్లకు పంచామృతాభిషేకం, శ్రీలలితా సహస్రనామ పారాయణం, స్వామి వార్ల కల్యాణోత్సవం, రథోత్సవాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్య స్వామి వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్ర గురించి భక్తులకు వివరించారు. సమాజంలో మూఢాచారాలను వ్యతిరేకించి మానవులకు జ్ఞాన ప్రబోధాన్ని అందించిన మహా కాలజ్ఞాన వేత్త అన్నారు. వెల్దుర్తి హనుమాన్ జంక్షన్ వ్యవస్థాపకులు శ్రీరామాంజనేయులు, బొమ్మిరెడ్డి పల్లె భీమలింగేశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్త పూడూరు లక్ష్మీరెడ్డి, ధార్మిక సంస్థల ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్ల నిధుల స్వాహాపై విచారణ జరపాలి


జేసీ బి.నవ్యకు వినతిపత్రం ఇస్తున్న వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం నాయకులు, మహిళా నేతలు

కర్నూలు(సెంట్రల్): బీసీ మహిళలకు కుట్టు మిషన్లు, శిక్షణ ఇచ్చేందుకు కేటాయించిన నిధులను పక్కదారి పట్టించిన కుంభకోణంపై విచారణ జరిపించాలని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బి.రాఘవేంద్రనాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం బీసీ సెల్ ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్ బి.నవ్యకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీ మహిళల జీవనోపాధులను పెంచేందుకు కేటాయించిన రూ.257 కోట్లలో సుమారు రూ.167 కోట్లు పక్కదారి పట్టినట్లు చెప్పారు. ఈ నిధుల దుర్వినియోగంపై పత్రికల్లో కథనాలు వస్తున్నా ప్రభుత్వం విచారణ చేయించడం లేదని, ఎందుకో వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు కల్లా నాగవేణిరెడ్డి, రాష్ట్ర మహిళా విభాగం జోనల్ ప్రెసిడెంట్ గాజుల శ్వేతా రెడ్డి, మహిళా విభాగం కార్యదర్శి భారతి, కార్పొరేటర్ మునెమ్మ, నగర మహిళా విభాగం నాయకురాలు మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

సోలార్‌పై అవగాహన


సోలార్ ప్యానెల్స్ గురించి వివరిస్తున్న దృశ్యం

కర్నూలు సిటీ: పీఎం సూర్య ఘర్ పథకం (సోలార్) గురించి ఐటీఐ విద్యార్థులకు కీర్తి పవర్ సోలార్ ఏజెన్సీస్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. బుధవారం కర్నూలు నగరంలోని ఎల్‌టీసీఐటీ కాలేజీలో నిర్వహించిన కార్యక్రమంలో కీర్తి పవర్ సోలార్ ఏజెన్సీస్ అధినేత జనార్దన్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. తక్కువ ఖర్చుతో ప్రకృతిని వినియోగించుకొని విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకునేందుకు సోలార్ చక్కగా ఉపయోగపడుతుందన్నారు. పీఎం సూర్య ఘర్ పథకం కింద ఇంటిపై సోలార్ ప్యానెల్స్‌ను ఏర్పాటు చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం రూ.78 వేల వరకు సబ్సిడీ ఇస్తుందన్నారు. ఈ పథకం కింద సోలార్‌ను ఏర్పాటుకు తక్కువ వడ్డీకే బ్యాంకులు రుణ సదుపాయం కల్పిస్తున్నాయని వివరించారు. విద్యార్థులు, కాలేజీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


మృతిచెందిన గొల్ల వీరేష్

కోడుమూరు రూరల్: ద్విచక్ర వాహనాలను కారు ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందగా, మరో వ్యక్తి గాయపడ్డాడు. కోడుమూరు నుంచి కర్నూలుకు వెళ్లే రోడ్డులో ప్యాలకుర్తి సమీపంలో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాలు.. ఆస్పరి మండలం పలుకూరుబండ గ్రామానికి చెందిన గొల్ల వీరేష్ (35) బుధవారం ప్యాలకుర్తిలో జరిగిన దేవరకు బంధువుల ఇంటికి వచ్చి తిరిగి స్వగ్రామం వెళ్లేందుకు బైక్‌పై బయలుదేరాడు. ఈ నేపథ్యంలో ప్యాలకుర్తి గ్రామం దాటిన కొద్ది సేపటికే కోడుమూరు వైపు నుంచి కర్నూలు వెళ్తున్న కారు వేగంగా వీరేష్ బైక్‌ను ఢీకొట్టడంతో పాటు, కర్నూలు నుంచి తెర్నేకల్‌కు వివాహ నిమిత్తం వెళ్తున్న భీమేష్ బైక్‌ను కూడా ఢీకొట్టింది. దీంతో వీరేష్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందగా, కర్నూలుకు చెందిన భీమేష్‌కు రక్తగాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే కారులో ప్రయాణిస్తున్న వ్యక్తులు కారును ప్రమాదం జరిగిన చోటనే వదిలేసి పారిపోయారు. విషయం తెలుసుకున్న కోడుమూరు ఎస్ఐ ఎర్రిస్వామి ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య ఎల్లేశ్వరితో పాటు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు సంతానం. కుటుంబ పెద్ద దిక్కు మృతితో కుటుంబ సభ్యులు తీవ్ర శోకసంద్రంలో మునిగిపోయారు.